ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయాలి

జలమండలి అధికారులకు కూన శ్రీశైలంగౌడ్ సూచన



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ప్రవర్తించే అధికారులను ఉపేక్షించబోమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఇళ్లకు సరఫరా అయ్యే నీరు సరిగా రావడం లేదని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అందుకే కార్యాలయానికి వచ్చానని తెలిపారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు సరిపడా సరఫరా చేయాలని ఆయన అధికారులకు సూచించారు. డొమెస్టిక్ కనెక్షన్ల పేరిట కమర్షియల్ కనెక్షన్‌లు ఉన్నవారికి నీటిని సరఫరా చేస్తున్నారని, అటువంటి అధికారులను ప్రభుత్వం ప్రోత్సహించదని, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. స్థానికంగా నీటి సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడాలని, అంతే తప్ప సరఫరాలో అజాగ్రత్తగా వహిస్తే ప్రభుత్వ పరంగా చర్యలు తప్పవన్నారు.

ఉచితంగా ఆధ్యాత్మిక సమ్మర్ క్యాంప్

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో భగవద్గీతపై ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు శ్రీధర్మశాస్త్రసేవా సమితి ఓ ప్రకటనలో పేర్కొంది. పదిహేను రోజుల పాటు జరిగే శిబిరంలో ధ్యానం, నిత్య పూజా శ్లోకం, భగవద్గీత శ్లోకాలపై వివరణతో కూడిన శిక్షణ, ప్రతి విద్యార్థికి ఉచితంగా భగవద్గీత పుస్తకం, హనుమాన్ చాలీసా పారాయణం, భజన, కీర్తనలు, ఒక రోజు ఆధ్యాత్మిక యాత్ర ఉంటుందన్నారు. ఈనెల 28వ తేదీ ఉదయం 9గంటల నుంచి శిక్షణ శిబిరం ప్రారంభం అవుతుందని పేర్కొంది. రిజిస్ట్రేషన్‌కు ఫోన్ నం.99492 36133 / 90596 63440లో సంప్రదించాలని శ్రీధర్మశాస్త్ర సమితి కోరింది.

హాట్ సీట్.. లక్కీ చాన్స్

మల్కాజిగిరి లోక్‌సభ నుంచి బరిలో నిలిస్తే రాజకీయ భవిష్యత్తే..


- మల్లారెడ్డికి మంత్రి చాన్స్ మల్కాజిగిరి చలువే
- రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవి.. సీఎం అదృష్టం ఇక్కడి స్థాన బలమే..
- ఇక్కడ ఓడిపోయినా.. రాజకీయ ప్రాబల్యం తగ్గదని చర్చ

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద నియోజకవర్గంగా పేరొందిన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పలువురు రాజకీయ నాయకులకు పునర్జన్మ ఇచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందిన నాయకులకు తమ రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించిన నేతలకు తమ పార్టీలో అత్యున్నత పదవులు దక్కమే కాకుండా.. పాలనాపరంగా ముఖ్యమంత్రిగా, కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పనిచేసే అదృష్టాన్ని పొందారన్న నానుడి ఉంది.

◆ ఈ నియోజకవర్గం నుంచి పోటి చేసి ఓడిపోయిన నేతలకు కూడా రాజకీయ రంగంలో అదృష్టం కలిసొచ్చిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఏది ఏమైనా, రాజకీయ పునరావాసానికి, భవిష్యత్‌కు మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం సెంట్‌మెంట్‌గా కలిసొస్తుందని పలువురు నాయకులు భావిస్తుండటంతో.. ప్రస్తుత ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం హాట్ సీటు.. లక్కీచాన్స్‌గా మారిందనడంలో సందేహం లేదన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పార్టీల అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్(బీజేపీ), పట్నం సునీత మహేందర్‌రెడ్డి(కాంగ్రెస్), రాగిడి లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్)లకు కూడా మల్కాజిగిరి సెంట్‌మెంట్ ఏ విధంగా కలిసి వస్తుందో వేచిచూడాల్సిందే అంటున్నారు.

◆ 2009లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సర్వే సత్యనారాయణ పోటీ చేసి గెలుపొందడం వల్లే.. కేంద్రమంత్రి వర్గంలో స్థానం దక్కిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. అలాగే, ఇదే లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడుగా గెలిచిన సర్వే సత్యనారాయణకు రాజకీయంగా అదృష్టం కలిసి వచ్చిందన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో ఉన్నాయి.

◆ 2014లో మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్‌లో టీడీపీ నుంచి ఎంపీగా గెలుపొందిన చామకూర మల్లారెడ్డికి పదవి కాలం పూర్తవకముందే.. మేడ్చల్ అసెంబ్లీ స్థానం నుంచి శాసనసభకు పోటీ చేసి గెలుపొంది. రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం సంపాదించుకున్నారు. ఇది కూడా మల్లారెడ్డికి కలిసొచ్చిన మల్కాజిగిరి సెంటిమెంటేనని పేర్కొంటున్నారు.



◆ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటి చేసి ఓడిపోయిన రేవంత్‌రెడ్డికి మల్కాజిగిరి సెంట్‌మెంట్ బాగా కలిసొస్తుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. 2019లో అనుహ్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటి చేసి, విజయం సాధించిన రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవిని కాంగ్రెస్ అధిష్ఠానం కట్టబెట్టింది. దీంతో ఆయన రాజకీయ జీవితం మలుపు తిరిగింది. అనంతరం 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కొడంగల్ నుంచి పోటీ చేసి విజయం సాధించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. రాష్ట్ర మంత్రి వర్గంలో సభ్యుడిగా పని చేయకుండానే రేవంత్ రెడ్డి ఏకంగా సీఎం కావడం మల్కాజిగిరి సెంట్‌మెంట్ అనే చర్చ రాజకీయ వర్గాల్లో ప్రచారమవుతోంది.

ఓటమి చెందినా..

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి 2019లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ విజయం కూడా రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరి సెంటిమెంటేనన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లోనూ..

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నేతలు గెలిచినా.. ఓడినా తమ రాజకీయ ఎదుగుదల, భవిష్యత్‌కు ఈ స్థానం సెంటిమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పోటీలో నిలుస్తున్న నేతలకు మల్కాజిగిరి సెంటిమెంట్ ఏవిధంగా తమ రాజకీయ భవిష్యత్‌కు ఉపయోగపడుతుందో.. వేచి చూడాల్సిందే.

◆ అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అలాగే, జెడ్పీ చైర్‌పర్సన్‌గా మూడు పర్యాయాలు పనిచేసిన పట్నం సునీత మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవగా, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి తన రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకుంటున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక నేత చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థర్మో కేబుల్ కంపెనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... మే 13న జరిగే ఎన్నికల్లో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కార్మికులు అత్యధికంగా జీవిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే కార్మికుల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాడుతారని అన్నారు. కార్మికుల శేయస్సు కోసం పాటుపడేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు పార్టీకి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ వర్మ మనోహర్ హెగ్డే, జనరల్ మేనేజర్ రిషికుమార్, వైస్‌ప్రెసిడెంట్ జమీల్ జంగల్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

క్షత్రియుల ఆత్మీయ సమావేశం



అఖిల భారత క్షత్రిమ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న క్షత్రియ సంఘం నాయకులు

నిజాంపేట్: క్షత్రియులంతా సంఘటితమై దేశం కోసం, స్వజాతి సంక్షేమం కోసం పాటుపడాలని అఖిల భారత క్షత్రియ మహాసభ జాతీయ అధ్యక్షుడు మహేంద్రసింగ్ తన్వర్‌జీ అన్నారు. శుక్రవారం నిజాంపేట్‌లో జరిగిన క్షత్రియుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 126 సంవత్సరాల చరిత్ర కలిగిన అఖిల భారత క్షత్రియ మహాసభ ఆధ్వర్యంలో దేశానికి, క్షత్రియులకు అనేక సేవలు చేస్తూ వస్తోందని పేర్కొన్నారు. మహాసభ తెలంగాణ అధ్యక్షుడు రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఛగన్ సింగ్‌రాథోడ్, రాజ్‌సింగ్ రాజ్‌పుట్, హరిశంకర్‌సింగ్, డాక్టర్ ఎమ్.ఆర్.ఎస్ రాజు, మంతెన నాగవర్మ, జీవీ సుబ్బరాజు, వీర్రాజు, సత్యనారాయణ రాజు, మూర్తి రాజు, విజయ్ గోపాల్‌రాజు, ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు.. ప్రమాద ఘంటికలు



పంచశీల కాలనీలోని స్టార్ ఎంటర్‌ప్రైజెస్ పక్క గల్లీలో అసంపూర్తిగా డ్రైనేజీ మ్యాన్‌వాల్వ్

రంగారెడ్డినగర్: అసంపూర్తి పనులు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి.. భూగర్భ డ్రైనేజీ లైన్ పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని స్టార్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ భవనాన్ని ఆనుకని ఉన్న గల్లీలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్ పైపును అనుసంధానం చేసేందుకు మరో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను నిర్మించారు. అయితే సదరు కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు పూర్తి చేసి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయకుండా వదిలేశాడు. దీంతో డ్రైనేజీ మ్యాన్‌వాల్వ్ చెత్తతో కూరుకుపోయింది. దీంతో ప్రజాధనం వృథాగా అవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించిన మ్యాన్‌హోల్‌ను పునరుద్ధరించడంతో పాటు డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సమీప ఇళ్ల వాసులు కోరుతున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని అంబీర్ లేక్ వాకింగ్ ట్రాక్ సమీపంలో ఈనెల 20వ తేదీన ప్రసాద్ ఆస్పత్రి సౌజన్యంతో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లేక్ వాకర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఉదయం 7గంటలకు క్యాంప్‌ను బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రజనీ ప్రారంభిస్తారని తెలిపింది. అనంతరం వాకర్స్‌తో సమావేశమవుతారని పేర్కొంది.

21న బీవీఆర్‌ఐటీ వార్షికోత్సవం

నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్‌ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాలు ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎస్‌ఏపీ సర్వీస్ ఏరియా లీడర్ లక్ష్మీనాయర్, చైర్మన్ విష్ణురాజు, వైస్‌చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య, ప్రిన్సిపాల్ సునీత తదితరులు హాజరుకానున్నారు.

21వ తేదీన 2కే రన్

దుండిగల్: డి.పోచంపల్లిలోని ఎడ్జిమెంట్ ది గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన 2కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం ఓ ప్రకటలో తెలిపింది. ప్రజల్లో ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపుతాం

సుభాష్‌నగర్: సూరారం రాజీవ్‌గృహకల్పలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జలమండలి ఏఈ అనుషతో కలిసి రాజీవ్‌గృహకల్ప బ్లాక్ నం.105 వద్ద జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులు పూర్తయితే గృహకల్పలో నెలకొన్న మురుగు సమస్య తీరనుందన్నారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించే బాధ్యత మనదే..

కార్యకర్తలతో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్



రంగారెడ్డినగర్: లోక్‌సభ ఎన్నికలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని రంగారెడ్డినగర్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా విజయశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో స్థానికంగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్టీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడు స్పీడ్‌బ్రేకర్లు కనిపిస్తున్నాయ్...



ఏపీహెచ్‌బీ కాలనీ ఆర్చ్ నుంచి జలమండలి కార్యాలయ రోడ్డులో స్పీడ్‌బ్రేకర్‌కు రంగులు

సాక్షి ఎఫెక్ట్..

రంగారెడ్డినగర్: స్పీడ్‌బ్రేకర్లు సరిగా కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్న విషయంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కాలనీ అసోసియేషన్ స్పందించింది. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీ ఆర్చ్ నుంచి జలమండలి కార్యాలయం మీదుగా ఇటీవల కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. 'దగ్గరకు వచ్చే వరకు స్పీడ్‌బ్రేకర్ ఉందని తెల్వదు'అనే శీర్షికన వార్తా కథనం శుక్రవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అసోసియేషన్ సభ్యులు ఉదయమే స్పీడ్ బ్రేకర్లకు రంగులు వేసేలా చర్యలు చేపట్టారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ పరిధి బహదూర్‌పల్లిలోని సాయినాథ్ సొసైటీలో శుక్రవారం వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతంతో అభిషేకం చేశారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో ఈనెల 21న విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. మూడు రోజుల పాటు పూజల అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ తెలిపింది.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు నమోదు చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేయాలని జిల్లా వ్యయ పరిశీలకుడు మనోజ్ అలోయిస్ లక్రా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మరో వ్యయ పరిశీలకుడు ధృవ్ భోళాలుతో కలసి ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్, షాడో టీమ్‌లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని టీమ్‌లు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. అనుమానాస్పద ఖాతాలను చెక్ చేయాలని ఇన్‌కమ్ టాక్స్, బ్యాంకు అధికారులను ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. కరపత్రాలు పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్ అండ్ ప్రచురణకర్తలు ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం 127ఏ ప్రకారం నిబంధలను పాటించాలన్నారు.

ఎన్నికల వ్యయం నమోదు చేయాలి

ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా రోజువారీ దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియాపై పటిష్ట నిఘా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బులు, మద్యం పంపిణీపై ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్‌ఎస్‌టీ తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. లావాదేవీలపై పర్యవేక్షణ చేయాలన్నారు.

తనిఖీలు ముమ్మరం

అన్ని టీంలు జిల్లాలో చెక్ పోస్టుల ద్వారా నిఘా ఏర్పాటు చేశామని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుతో తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. సీ- విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 1950 కాల్ సెంటర్, గ్రీవెన్స్ కమిటీ సెంటర్, ఎంసీఎంసీ, మీడియా సెంటర్లను జిల్లా వ్యయ పరిశీలకులు తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, ఎక్స్‌పెండిచార్ మానిటరింగ్ నోడల్ అధికారి రాజేందర్‌రెడ్డి, నోడల్ అధికారులు, ఇతర టీం సభ్యులు పాల్గొన్నారు.

కమిటీ రద్దు చేయాలి

- విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- ఎస్‌ఎఫ్‌ఐ, స్టూడెంట్స్ యూనియన్, ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో చోటు చేసుకున్న ఘటనలపై వేసిన కమిటీ తక్షణం రద్దు చేయాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ఎదుట స్టూడెంట్స్ యూనియన్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్‌లో జరిగిన ఘటనలపై విచారణ చేపట్టేందుకు కమిటీని వేయడం స్వాగతిస్తామని, కానీ ఒక వర్గానికి మద్దతు ఇచ్చే వారికి ఇందులో చోటు కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. వెంటనే ప్రస్తుత కమిటీని రద్దు చేసి వెంటనే కొత్తగా న్యాయబద్ధంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంపై సిఫార్సు చేసే వారికి కమిటీలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, నాయకులు మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పునరావాస కేంద్రం 'మల్కాజ్‌గిరి'

- ఇతర ప్రాంతాల్లో ఓడిన వారు ఇక్కడికి వలస వస్తున్నారు
- మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



కొంపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని... ఇతర ప్రాంతాల్లో ఓడిన వారు ఇక్కడికి వచ్చి పోటీ చేస్తున్నారని మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కొంపల్లిలో శుక్రవారం ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పెట్టుబడులు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణంతో హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చిందన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కకు పెట్టి బీఆర్‌ఎస్ నాయకులపై ఎదురుదాడికి దిగుతూ పబ్బం గడుపుతోందన్నారు.

◆ అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... రాజకీయాల పరమావధిగా ప్రజల సమస్యలను పక్కకు పెట్టి నీచ రాజకీయాలు చేసే బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పి మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్‌చైర్మన్ గంగయ్యనాయక్, పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జీడిమెట్ల డివిజన్ పరిధిలో జోరుగా ప్రచారం



జీడిమెట్లలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

◆ జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జయరాం నగర్, గణేష్ హౌసింగ్ సొసైటీ, శ్రీ కృష్ణా నగర్, మహానగర్ కాలనీ, రుక్మిణి ఎస్టేట్స్, ప్రశాంత్ నగర్ కాలనీల్లో ఎమ్మెల్యే వివేకానంద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తుంటే, మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ నీచమైన రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల బాధలు, వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సోమేశ్‌యాదవ్, కుంట సిద్దిరాములు, సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, నదీమ్‌రాయ్, కుంటి మల్లేశ్, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, రవి, ప్రతాప్‌రెడ్డి, నాగభూషణం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎలిసియం







దుండిగల్: విద్యార్థులు నృత్యాలతో హోరెత్తించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను కట్టిపడేశాయి. ర్యాంప్ వాక్‌లతో విద్యార్థినులు అదరగొట్టారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలలో ఎలిసియం 2కే24 పేరుతో కళాశాల వారికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే, ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ట్రెజరర్ మమతరెడ్డి, డైరెక్టర్లు అను శ్రేయరెడ్డి, శ్రీధర్, ప్రిన్సిపాళ్లు మురళిప్రసాద్, అర్జబ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.